క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఎంపీడీఓ సాంబశివరావు



దాచేపల్లి : మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ సాంబశివరావు అన్నారు. మండలంలోని కేసానుపల్లిలో గ్రామోదయ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సాంబశివరావు మాట్లాడుతూ.. గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు చేసేలా చూడాలని పంచాయతీ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ కోట కొండలు, ఎంపీటీసీ సీహెచ్. ఏసుదాసు, డాక్టర్ సుచరిత, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ఏఈలు సోమయ్య, శ్రీనివాసనాయక్, నాయకులు ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి కోటేశ్వరరావు, చిరంజీవి, గంగరాజు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ నయోమి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యను అభ్యసించకోరే విద్యార్థులు ఈ నెల 22 నుంచి జూన్ 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్లు పాటిస్తూ ప్రవేశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ నయోమి పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఏపీఎంఎస్ వెబ్ సైట్ చూడాలని ప్రిన్సిపల్ కోరారు.

రీ సర్వేకు రికార్డులు సిద్ధం చేయండి

ఆర్‌డీఓ అద్దెయ్య



పిడుగురాళ్ల: భూ రీ సర్వేకు కావాల్సిన రికార్డులను సిద్ధం చేయాలని గురజాల ఆర్‌డీఓ అద్దెయ్య సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ అద్దెయ్య మాట్లాడుతూ పిడుగురాళ్ల మండలంలో చిన్న అగ్రహారం, పెద్ద అగ్రహారం గ్రామాల్లో భూ రీ సర్వే నిర్వహించడం జరిగిందని, మండలంలోని మిగిలిన రెవెన్యూ గ్రామాలన్ని భూ రీ సర్వే నిర్వహించేందుకు రికార్డులను సిద్ధం చేయాలని అధికారులకు, తహసీల్దార్‌కు సూచించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వే రికార్డులను పరిశీలించటం జరిగిందన్నారు. అలాగే అధికారులంతా రీ సర్వే సంబంధించి పలు సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాచేపల్లి : ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్. రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లలో చదువుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 22వ తేది నుంచి వచ్చే నెల 7వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు: 7032996448 సంప్రదించాలని ఆయన కోరారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

పిడుగురాళ్ల: వేసవిలో ఎండల తాటికిడికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం మంచి కార్యక్రమని పట్టణసీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని సత్యసాయి మందిరం వద్ద శుక్రవారం గ్లోబల్ సీ ఫుడ్ అలియన్స్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ సీఐ ఆంజనేయులు రిబ్బన్ కట్ చేసి ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇటువంటి చలివేంద్రాలు నిర్వహించటం మంచి కార్యక్రమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గర్నె నాగేశ్వరరావు, సుధీర్, రమేష్, సాయి, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామోదయం

జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఎం.విజయ భాస్కర్‌రెడ్డి



మిట్టగుడిపాడులో బడిఈడు పిల్లలతో మాట్లాడుతున్న అధికారులు



గ్రామోదయం కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు



చింతపల్లిలో పర్యటిస్తున్న ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్, మండల అధికారులు

మిట్టగుడిపాడు(రెంటచింతల): గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడానికే గ్రామోదయం కార్యక్రమాన్ని గ్రామాల్లో తలపెట్టినట్లు మండల ప్రత్యేక అధికారి జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఎం.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమాన్ని చేపట్టి స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రెండు బోర్లుకు చేతి పంపులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. బడిఈడు పిల్లలతో ఆయన మాట్లాడుతూ మీరు ఏ పాఠశాలలో చదువుతున్నారు..అడిగి తెలుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా కార్పోరేట్ స్కూల్స్‌కు దీటుగా అభివృద్ధి పరిచి నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో ఎంపీడీఓ షేక్ గైసియాబేగం, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఏపి ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వలి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, ఏపీఎం వెలుగు చిన్నబాబు, కార్యదర్శి గుండ్రేడ్డి అనంత కోటేశ్వరరావు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

నెహ్రూ నగర్ తండాలో గ్రామోదయం

దుర్గి: గ్రామస్తులు ఐకమత్యంగా ఉండి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని మండల స్పెషల్ ఆఫీసర్ కె సంజీవరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నెహ్రూనగర్ తండాలో నిర్వహించిన గ్రామోదయం కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాల విద్యపై స్థానిక విద్యార్థులను, వారి చదువుల గురించి ఆరా తీశారు. స్థానిక పీహెచ్‌సి వైద్యులు, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయనకు వివరించారు. అనంతరం ప్రజల ఆరోగ్య విషయాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధులను సైడ్ కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. స్థానికులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సర్పంచి సుబ్రహ్మణ్యం నాయక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రాజు, పంచాయతీ రాజ్ ఏఈ వెలుగొండారెడ్డి, ఎపిఎం వెంకటేశ్వర్లు, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారెంపూడి: మండలంలోని చింతపల్లిలో గ్రామోదయం కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తదితర అధికారులు గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ ఒక చోట, గ్రామ ప్రధాన కూడలిలో మరోచోట సైడ్ డ్రైన్స్ అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. బీసీ కాలనీలో ఒక బజారు ప్రజలు రోడ్డు వేయాలని కోరారు. కుక్కల బెడద ఉందని ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎస్సీ కాలనీలో ఒక చోట ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్తు లైన్ పోతోందని లైన్ షిఫ్ట్ చేయాలని అధికారులకు విన్నవించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక అధికారి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈఓఆర్డీ సత్యప్రసాద్, డీటీ కీర్తిసుధాస్రవంతి, గ్రామ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి పంగులూరి రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు



పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ రమేష్ కుమార్

కారెంపూడి: పర్యావరణ పరిరక్షణపై కారెంపూడి గ్రామ సచివాలయం 2లో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని అటవీ శాఖ నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణలో మానవుని పాత్ర అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీటీసీ షేక్ ఆరీఫ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచాలని అడవులను పరిరక్షించుకోవాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతో పాటు పర్యావరణం మేలు కోరుతూ మానవుని జీవితం సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలుష్యనివారణకు పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు మొక్కలు పెంచకపోతే మానవుని మనుగడ కష్టం అవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి పోతాయని అలాగే వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు భూతాపానికి కారణం అవుతున్న వాటిని వాడవద్దని ప్రతి ఒక్కరు ఒక మొక్క పెంచాల్సిన అవశ్యకత ఉందన్నారు. కారెంపూడి అటవీశాఖ బీట్ అధికారి షేక్ అమీర్ భాషా పర్యావరణహిత జీవన విధానంపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు కొచ్చెర్ల శివతేజ, దారివేముల అనూషాప్రియదర్శిని, మాఢావత్ సారాభాయి, రమావత్ రాజీవ్ నాయక్ ప్రజలు పాల్గొన్నారు.

దుర్గి: సమాజంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, దీని వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మానవ జాతి మనుగడకే ప్రమాదం అని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లైఫ్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణం ఏర్పాటుకు ఇప్పటి నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించి జ్యూట్ బ్యాగులను పేపర్ వస్తువులను ఉపయోగించుకోవాలని ప్రజలను కోరారు. మాచర్ల అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ వెంకయ్య మాట్లాడుతూ చెట్లను సంరక్షించుకుంటూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పవన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ నిర్మల, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, విఆర్‌ఓలు కోటేశ్వరరావు, రంగారావు, సునీత, వీఆర్ఏ కరిముల్లా, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్ శాస్త్రి, తులసినాయక్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులున్నారు.

బీసీడేను ఘనంగా చేద్దాం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి గురవాచారి



సమావేశంలో మాట్లాతున్న కుందుర్తి గురవాచారి, పార్టీ నేతలు

పిడుగురాళ్ల: ఈ నెల 20వ తేదీన బీసీడేను ఘనంగా జరుపుకుందామని, అందుకు గురజాల నియోజకవర్గంలోని ప్రతి ఒక్క బీసీలు, బీసీ సంఘాల నాయకులు అందరవు హాజరు కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కుందుర్తి గురవాచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కుందుర్తి గురవాచారి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని జరుపుకునే ఈ బీసీడేలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. శనివారం ఉదయం 10 గంటలకు కొండమోడు జంక్షన్ వద్దకు బీసీలంతా ఏకమై రావాలని సూచించారు. కొండమోడులోని కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహం వద్ద జరపున్నట్లు తెలిపారు. పలువురు ముఖ్య నాయకులు కూడా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్‌కొమెర వెంకటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, 2వ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీను, బీసీ నాయకులు యెనుముల వెంకటేశ్వర్లు, ఇల్లూరి వెంకయ్య, ఇర్లా గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి : బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించిన దివంగత సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతిరోజున జరిగే బీసీల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు కోరారు. నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పిడుగురాళ్లలోని కొండమోడు దగ్గర నుంచి ప్రారంభమైయ్యే ర్యాలీలో మండలంలోని బీసీలందరూ పాల్గొన్నాలని వారు కోరారు. సమావేశంలో సర్పంచ్ ఈసరాజుల శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యుడు గుంజా వెంకటప్పయ్య, నాయకులు ఉల్లేరు హనుమంతరావు, పల్లపు హనుమంతరావు, దేవళ్ల వీరాస్వామి, బత్తుల వెంకయ్య, బత్తుల బాలయ్య, వేముల తిరుపతయ్య, ఓర్సు దుర్గారావు, గుంజా వెంకట్రావ్, బండల శ్రీను, శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గురజాల : దివంగత ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బీసీ డేగా మార్చాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసు బ్రహ్మానందారెడ్డి 92 కులాలకు బీసీ రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మే 20వ తేదీన బీసీ డేగా నిర్వహించే విదంగా చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా కాశీబాబు, దాచేపల్లి గురజాల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తగుళ్ల పెద్ద పిచ్చయ్య, షేక్ నాసర్‌సైదా, మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా, బత్తుల తిమ్మరాజు, కందిమళ్ల శ్రీనివాసరావు,దేవండ్ల నారాయణ, కె ఆంజనేయులు, కల్లూరి శ్రీను, తదితరులున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గురజాల : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాచేపల్లి మండలంలోని గామాలపాడు గ్రామానికి చెందిన షేక్ లాల్ (35) మార్బుల్ పనిచేస్తూ జీవనంసాగిస్తున్నాడు. ఈనెల 14వ తేదిన మాచర్లలో పని ముగించుకుని తిరిగి గామాలపాడు వస్తుండగా మార్గం మధ్యలో అంబాపురం వద్ద గల కోల్డు స్టోరేజ్ నందు ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిగా తలకు బలమైన గాయంఅయింది. వెంటనే అంబులెన్సు ద్వారా గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కొరకు నరసరావుపేట రిఫర్ చేశారు. నరసరావుపేట నందు గల ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఒక మగ, ఆడ సంతానం కలరు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

మాచవరం: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన సంకురాత్రి గంగమ్మ మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఆరుబయట నిద్రింస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఈపూరి పుల్లారెడ్డి ఆమె పట్ల అభ్యంగా ప్రవర్తించాడు. ఇదేమని మహిళ బంధువులు ప్రశ్నించగా, దిక్కుఉన్నచోట చెప్పుకోమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో గంగమ్మ ఫిర్యాదు మేరకు పుల్లారెడ్డితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడిపై కేసు నమోదు...

మండలంలోని పిన్నెల్లి గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌వలి గత కొంత కాలంగా నకరికల్లులో నివాసం ఉంటున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం స్వగ్రామానికి వచ్చాడు. గ్రామస్తుడు పుల్లారెడ్డితో కలిసి ఆవులగడ్డ సెంటర్‌లో టీ స్టాల్ వద్ద టీ తాగుతుండగా అదే గ్రామానికి చెందిన సంకురాత్రి బుడ్డ వెంకయ్య, శివయ్య, బ్రహ్మయ్య, మరి కొందరు కర్రలు, మారణాయుధాలతో దాడి చేసారు. ఘటనలో నాగుల్‌మీరాకు భుజానికి, ఎడమ కాలికి గాయాలయ్యాయి, నాగులమీరా పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

రెంటచింతల: పండ్ల తోటలను సాగుచేసే రైతులకు పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన ఎంతో అవసరమని గురజాల ఉద్యానశాఖ అధికారి ఎం.మోహన్ అన్నారు. శుక్రవారం రెంటచింతలకు చెందిన బోయపాటి ఇన్నారెడ్డి(రాగి) సాగుచేస్తున్న మామిడి, సీతాఫలం, యన్నం మరియ సుధాకర్‌రెడ్డి సాగు చేస్తున్న ఎర్రజామ, సపోటా, సీతాఫలం, డ్రాగన్స్, అంజీరా, నేరేడు, కొబ్బరి, వాటర్ ఆపిల్, స్వీట్ ఆరంజ్, స్టార్ ఫ్రూట్స్, నల్ల జామ పండ్ల మొక్కలను ఆయన పరిశీలించారు. గతంలో ఎకరాకు కేవలం 40 నుంచి 60 మొక్కలను మాత్రమే పెంపకం ఉండేదన్నారు. కొత్త తరహాలో మామిడి తోటలను పెంపకంపై అవగాహన కలిగిన ఇన్నారెడ్డి అత్యధిక సాంద్రతలో మామిడి పంటను సాగు చేస్తున్నట్లు ఈ తరహాలో ఎకరాకు 520 మామిడి మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. దీంతో 4 సం. నుంచి మంచి దిగుబడి వస్తుందన్నారు. పండ్ల మొక్కలకు వచ్చే వివిధ రకాల తెగుళ్ళు వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అధికారుల సూచనలతో పండ్ల మొక్కలను పెంచిన అధిక దిగుబడులను సాధించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉపాధి నిధులతో 100 శాతం రాయితితో పండ్ల పెంపకమునకు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఎస్ఎఫ్, ఎంఎఫ్ రైతులతో పాటు 5 ఎకరాలు ఉన్న రైతులు నీటి వసతి ఉన్నవారు, బావి బోరు కలిగిన వారు ఈ పథకంకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోట, బత్తాయి, జీడి మామిడి, దానిమ్మ, యాపిల్ వేర్ పండ్ల మొక్కలను అందచేస్తామ న్నారు. దరఖాస్తు చేసుకోనే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం నకలు, ఆడంగల్, వన్ బి, సన్న, చిన్న కారురైతు సరిఫికెట్, ఆధార్ కార్డ్ నకలు, రేషన్‌కార్డ్ నకలు, ఉపాధి జాబ్ కార్డ్ నకలుతో పాటు పాస్‌పోర్ట్ ఫోటో గురజాల తమ కార్యాలయంలో అందచేయాలని ఆయన కోరారు. ఆయన వెంట వీఏఏ పవన్, శంకర్, తిరుపతి నాయక్, రైతులు పాల్గొన్నారు.

గురజాల : రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్ తెలిపారు. స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతులు పండ్ల పంటలు వేసి లాభాలు సాధించాలనే అకాంక్షతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మొత్తం 17 రకాల పండ్ల తోటలకు సబ్సిడిపై అందించడం జరుగుతుందన్నారు.పండ్ల తోటలను మొదటి నాలుగు సంవత్సరాలు కాపాడుకుంటే అత్యధిక లాభాలు సాధించవచ్చన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తొటల పెంపకం చేయాలంటే రైతులు 5 యకరములు లోపు భూమిని కలిగివుండాలన్నారు. జాబ్ కార్డును, ఆధార్ కార్డు కలిగివుండాలన్నారు. గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పంటపొలాల్లో నీటి కుంటలు ఏర్పాటుచేసుకునే అవకాశం కలిప్పించడం జరిగిందన్నారు. పంట మార్పిడి చేస్తే రైతులకు ఎంతో దిగుబడి సాధించవచ్చన్నారు.గ్రామ స్థాయిలో రైతులను గుర్తించి వారిని రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో ఆహర కృత్రిమ పరిశ్రమల తయారీకి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 35 శాతం సబ్సిడిపై అందించడం జరుగుతుందన్నారు. రైతులకు, ప్రజలకు గ్రామాల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

సీఐ పీవీ ఆంజనేయులు



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్

పిడుగురాళ్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు హెచ్చరించారు. పట్టణంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందు బాబులపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో పట్టణంలోని బైపాస్ ప్రాంతంలో పిల్లుట్ల రోడ్డులో, ఖలీల్ దాబా పరిసర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులను కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సీఐ తన పోలీస్ బృందంతో బహిరంగ ప్రదేశాలలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పల్నాడుజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై దాడులు చేపట్టటం జరిగిందని, బహిరంగ ప్రదేశాలలో ఎవరు మద్యం సేవించరాదని ఈ సందరన్బంగా ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకి ఘన నివాళి




పట్టణంలోని సుందరయ్య కాలనీలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా కాలనీలో శుక్రవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ దక్షిణ భారత దేశ ఉద్యమనేత, పేదలపాటి పెన్నిధి కామ్రెడ్ సుందరయ్య తన ఇంటి నుంచి సామాజిక ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. తన యావదాస్తిని పేదలకు పంచటమే కాకుండా కడదాక పేద ప్రజల సమస్యలపైనే నిరంతరం పోరాటం చేశారన్నారు. ఆ రోజు ఉన్న భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా భూ పోరాటాలు నిర్వహించారన్నారు. అలాగే వ్యవసాయ కార్మిక సంఘాన్ని ప్రారంభించి దాని ఆధ్వరయంలో అనేక భూ పోరాటాలు , కూలీల పోరాటాలు నిర్వహించి తెలంగాణ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి పది లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకలుఉ జి. ప్రేమ్, చందు, మరియమ్మ, కరుణ, భూలక్ష్మీ, మస్తానమ్మ, అస్సాం, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

మాచవరం: స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయుడని సీపీఎం సీనియర్ నాయకుడు షేక్ లాల్‌అహమ్మద్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధింతిని పురష్కరించుకుని స్థానిక మండపాల సెంటర్ నందు సీపీఎం జెండా ను ఆవిష్కరించారు. ఆయనకు నివాళులు అర్పించారు. పేద ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్రహ్మనాయుడు, సత్యన్నారాయణ, హుస్సేన్, మస్తాన్‌వలి, ఎం.అనిల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



గ్రామోదయంలో పాల్గొన్న ప్రత్యేకాధికారి గబ్రునాయక్, ఎంపీడీఓ కోటేశ్వరరావు

మాచర్ల రూరల్: ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న లక్ష్యంతో ఉపాధి హామీ పనుల నిర్వాహణ చేపట్టాలని ప్రత్యేకాధికారి గబ్రు నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామోదయ కార్యక్రమంలో ఉపాధి హామీ పనులను పర్యవేక్షించి ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో పనులు నిర్వహించే వారికి టెంట్లు, మంచినీటితో పాటు మజ్జిగ ఖచ్చితంగా అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంటింటి వైద్యం తీరు పై వైద్యశాలలో వివరాలడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ నిర్వాహకులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు, సర్పంచ్ ఓరుగంటి చిన్నా, ఎంఈఓ వేముల నాగయ్య, డా.శివలీల, ఉప సర్పంచ్ కొండలు, హనిమిరెడ్డి, బాలిరెడ్డి తదితరులున్నారు.

వృద్ధురాలు మృతి

వెల్దుర్తి: కుటుంబ తగాదాల నేపథ్యంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బొజ్జా వెంకటమ్మ (65) మృతి చెందింది. కుమారుడు శ్రీనివాసరావు, కోడలు అంజమ్మలు గత కొన్ని రోజులుగా తరుచూ ఘర్షణలు పడ్డారు. అంజమ్మ భర్తపై అలిగి వెల్దుర్తిలోని తల్లిగారింటికి వెళ్ళింది. గురువారం రాత్రి అంజమ్మతో పాటు ఆమె తల్లిదండ్రులు మండ్లి ఈదెయ్య, పిన్నమ్మలు అర్ధరాత్రి సమయంలో అల్లుడు శ్రీను పై దాడి చేస్తుండగా వెంకటమ్మ అడ్డుపోవడంతో వెంకటమ్మపై దాడి చేసి గాయపరిచారు. దీంతో స్పృహ కోల్పోయింది. వెంకటమ్మను బంధువులు ఆటోలో మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందింది. కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ముగ్గురి పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూన్ మొదటి వారంలో మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తాం

పల్నాడు జిల్లా పీడీ బాలునాయక్



మహిళా మార్టులోని ర్యాకులను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా పీడీ బాలునాయక్

పిడుగురాళ్లరూరల్: మహిళల ఆర్థిక స్వయం సంవృద్ధి కోసం చేయుత మహిళా మార్టులు అందుబాటులోకి రానున్నాయని పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో త్వరలో ప్రారంభించనున్న చేయూత మహిళా మార్టులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా, పొదుపు సంఘాల మహిళలను యజమానులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేయుత మార్టులను ఏర్పాటు చేస్తున్నామని, ఇది కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఆయన అన్నారు. ఈ మార్టులో నాణ్యమైన, స్వచ్ఛమైన సరుకులను తక్కువ ధరలకే అందుబాటులో ఉంటాయని, జూన్ మొదటి వారంలో చేయూత మార్టులను ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీసీ నాగరాజు, సురేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఫీడర్ల విద్యుత్తు సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

పిడుగురాళ్ల: పట్టనంలోని శనివారం విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా 33/11 కేవీ మహావీర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోన శివాలయం, ఫడర్ మీద ఉన్న ప్రజాశక్తి నగర్, పోలీస్ స్టేసన్, పేరెడ్డి పెట్రోల్‌బంకు, అదేవిధంగా కళ్లం ఫీడర్ మీద ఉన్న ఖలీల్ దాబా నుంచి అయ్యప్పనగర్ వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ సైదారావు తెలిపారు. ఈ అంతరాయాన్ని పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని ఆయన తెలియజేశారు.